**Eenadu**

# కానిస్టేబుల్ కొలువులకు పీహెచ్‌డీల దరఖాస్తు

ఈనాడు – అమరావతి

ముందు ప్రభుత్వ ఉద్యోగం సాధించాలి. అది ఏ స్థాయిది అనేది ముఖ్యం కాదు. తర్వాత దాని ఆధారంగా ఉన్నతోద్యోగానికి ప్రయత్నించాలి.. ఇదీ రాష్ట్రంలో వేలాదిమంది యువత ఆలోచన. దీనికి అద్దం పడుతోంది తాజాగా జారీ చేసిన కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ ప్రకటన (నోటిఫికేషన్). ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్ అర్హతతో 4,548 కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తే.. ఇప్పటివరకు 1.95 లక్షల మంది దరఖాస్తు చేశారు. ఇందులో 34 వేల మందికిపైగా డిగ్రీ, ఆపై స్థాయి విద్యావంతులు ఉన్నారు. వీరిలో అత్యధికంగా బీకాం పట్టభద్రులు 20 వేల మంది, బీటెక్ విద్యావంతులు 9 వేల మంది ఉండడం గమనార్హం. ఎల్‌ఎల్‌బీ, ఎంబీఏ, ఎంకాం, ఎంటెక్, ఎంసీఏ, ఎంఎస్సీ, పీహెచ్‌డి చేసిన వారూ పెద్దసంఖ్యలో ఉన్నారు.

**ఇంత పోటీ ఎందుకంటే:** ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు ఉద్యోగాల భర్తీ కోసం ఉమ్మడి రాష్ట్రంలో 2012లో నియామక ప్రక్రియ చేపట్టారు. అప్పటి నుంచి గత నాలుగేళ్లుగా ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు. దీంతో ఉన్నత చదువులు చదివిన వారు నోటిఫికేషన్లు విడుదలవుతాయన్న ఆశతో కొన్నేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్నారు. నగరాలు, పట్టణాల్లో ప్రత్యేకంగా గదులు అద్దెకు తీసుకుని, శిక్షణ కేంద్రాల్లో తర్ఫీదు పొందుతున్నారు. వీరిలో చాలా మంది ఇప్పటికే ఖర్చులు, ఇతర ఆర్థిక భారంతో ఇక్కట్లు పడుతున్న పరిస్థితి. మరోవైపు చాలా మంది గరిష్ఠ వయోపరిమితికి దగ్గర్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎలాగైనా ఈ సారి ఏదో ఒక ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న తపనతో ఎక్కువ మంది ఉన్నత విద్యావంతులు దరఖాస్తు చేసుకున్నారు. తొలుత ఒక ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తే.. దాని ఆధారంగా మరింత ఉన్నతస్థాయికి ఎదిగేందుకు అవకాశముంటుందన్నది వారి భావన. కానిస్టేబుల్‌గానైనా ఉద్యోగంలో చేరితే సర్వీసు రిజర్వేషను ఆధారంగా ఎస్సై ఉద్యోగాలకు పోటీపడి సాధించవచ్చన్నది మరి కొందరు దరఖాస్తుదారుల ఆలోచన. "ఎంబీఏ చదివాను. ప్రభుత్వ ఉద్యోగం నా లక్ష్యం. కానిస్టేబుల్ ఉద్యోగానికి ఇంటర్మీడియటే అర్హత కావొచ్చు. కానీ ఏదైనా ప్రభుత్వ ఉద్యోగమే కదా. అందుకే దరఖాస్తు చేసుకున్నా" అని శ్రీకాకుళం జిల్లాకు చెందిన రాహుల్ వివరించారు.

**ఇప్పటికి ఒక్కో పోస్టుకు 42 మంది పోటీ..** జులైలో ఏపీ పోలీసు నియామక మండలి.. కానిస్టేబుల్ ఉద్యోగ ప్రకటన జారీ చేసి, ఈ నెల 3 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. సెప్టెంబరు 14తో ఈ గడువు ముగియనుంది. ఈ నెల 24వ తేదీ వరకూ 1.95 లక్షల దరఖాస్తులు అందాయి. వీరిలో 30 వేల మందికి పైగా మహిళలు ఉన్నారు. ఇప్పటి వరకూ వచ్చిన దరఖాస్తులను చూస్తే.. ఒక్కో పోస్టుకు కనీసం 42 మంది పోటీ పడుతున్నారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయ్యే నాటికి అభ్యర్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

**కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న పట్టభద్రులు (అంకెల్లో)**

| విద్యార్హత | దరఖాస్తుదారులు |
|---|---|
| పీహెచ్‌డీ | 4 |
| ఎంటెక్ | 300 |
| బీటెక్ | 9000 |
| ఎంబీఏ | 3000 |
| ఎల్‌ఎల్‌బీ | 15 |
| ఎంఎస్సీ | 1200 |
| ఎంకాం | 700 |
| బీకాం | 20,000 |